సుదర్శనం. యిప్పుడువచ్చిన కొత్త ఆపద యేమిటో అతనికింకా బోధపడలేదు.

శ్యాం కుర్చీలు తీసుకువచ్చి వేశాడు. ఇద్దరు పెద్దమనుషులూ న్యాయమూర్తులలాగా ఠీవిగా కుర్చీలమీద కూర్చున్నారు. సుదర్శనం, శ్యాం నేరస్థులలా ఓ ప్రక్కని నిలుచున్నారు.

మనోరమనాన్న రంగానాథంతో అన్నాడు: "చూడండీ! యీ కాలపు పిల్లలున్నారే అందరూ రాజకీయాలలో తిరిగేవాళ్ళే. అలాంటి కుర్రాడు నాకు అల్లుడైతే నా ఉద్యోగానికి ముప్పురావచ్చు. అదీకాక నాకు రాజకీయాలంటే తగని అసహ్యం. ముఖంమీద పొగడ కూడదు కానీ మీ అబ్బాయి నిజంగా చాలా బుద్ధిమంతుడు. తోటి విద్యార్థులంతావచ్చి బలవంతంచేసినా రాజకీయసభలలోకి వెళ్ళడు. రెండు నెలలనుంచి జాగ్రత్తగా నేను మీ అబ్బాయిని కనిపెడుతున్నాను. యిన్నాళ్లకు నాకుతగిన అల్లుడు దొరికాడని సంతోషించాను." అన్నాడు.

"రారా సుదర్శనం! పెళ్ళికూతుర్ని చూసి వద్దువుగాని." అన్నాడు రంగనాథం.

"వాళ్ళు చాలా కాలంనుంచి చూసుకుంటు న్నారు. యిక చూడవలసింది మీరే!" అన్నాడు మనోరమ నాన్న.

రంగనాథం మనోరమ నాన్నతో పెళ్ళి కూతుర్ని చూడ్డానికి వెళ్ళాడు. సుదర్శనం శ్యాంతో హోటలుకు వెళ్ళాడు.

స్కెచ్

# మేడనీడ

విశ్వమిత్ర

ఆ మూడంతస్థుల మేడకి తూర్పున సూర్యుడూ, పడమర వెంకడూ ఎందులోనో పోటీ పడ్డట్టు ఎవరి పనిమీద వాళ్లున్నారు. సూర్యుడు వేగంగా పైకి లేస్తున్నాడు. వెంకడు తను పడు కున్న కుక్కి మంచంలోంచి పైకి లేవటానికి ప్రయత్నించకపోయినా సూర్యుడి వేగంకంటే ఏమాత్రం తీసిపోని వేగంతో ఆలోచిస్తున్నాడు. ఆ మేడనీడని సూర్యుడు సుమారు ఓ అరఫర్లాంగు దాకా సాగదీసి మళ్ళీ క్రమంగా, ఆ మూడంత స్థుల మేడనీ, దానికంటే చిన్నదిగా నీడని తయారుచేయటానికి చేసే ప్రయత్నంలో మునిగి పోయాడు. అప్పుడప్పుడు చిన్న చిన్న మేఘాలు అడ్డం వొస్తున్నయ్. వాటిమీంచి తలెత్తి, మేడ నీడ ఎంత పొట్టయిందోనని పరీక్షగా చూస్తు న్నాడు సూర్యుడు. వెంకడు ఆలోచిస్తూనే వున్నాడు. ఆ మూడంతస్థుల మేడనీ ఒక్క కంటిలో ఇమిడ్చి చూస్తున్నాడు. మూడంతస్థుల మేడ ప్రతి అంతస్థునీ విడదీస్తూ ఒక చూరు ముందుకు పొడుచుకొచ్చింది. ఆ మేడకి పడమరగా వున్న తన వొంటి నిట్టాడి గుడిసె ఎత్తు మొదటి అంతస్థు చూరుకి సమానంగా వుంది. అందుకని వెంకడికి ఆమూడ ంతస్థుల మే డ పూర్తి యెత్తు స్పష్టంగా తెలుసు. తన గుడిసెమీద ఇంకా అట్లాంటి రెండు గుడిసెలు నిలబెడితే ఎంతఎత్తో ఆ మేడ అంత ఎత్తు అన్నమాట. వెంకడికి తన ఆలోచనచూసి నవ్వొచ్చింది. గుడిసెమీద గుడిసె నిలబెట్టడమేమిటి? ఇదేం లెక్క? వెంకడికి అకస్మాత్తుగా ఒకదానిమీద ఒకటి నిలబెట్టిన మూడు గుడిసెలూ కూలినట్టనిపించింది.

కుక్కిమంచంలోంచి నేలని తగులుతాను, అని బెదిరిస్తున్న నడుముని వెంకడు బల వంతంగా కొంచెం పైకి లేవనెత్తి, మళ్ళీ ఆలో చనల్లో పడ్డాడు. తన ఊహాపథంలో నిర్మించు కొన్న మూడు గుడిసెలూ కూలిపోవటంలో వెంక డికి మరింత నిరుత్సాహం కలిగింది. తను కనీసం ఒక తాపీవాడుగానన్నా పుట్టలేదేం? మూడంత స్థులు కట్టినా ముప్పై అంతస్థులు కట్టినా తాపీ వాడే నిజంగా. ఆ ఇంటి యజమానికంటేకూడా తాపీవాడే గొప్పవాడా? వెంకడి ఆలోచనలే దానికీ సమాధానం చెప్పినయ్. కాదని ఎందుకు? వెంకడికి మళ్ళీ అనుమానంవేసింది. తాపీవాడు, ఎంత ఎత్తు కట్టినా ఆ మేడకి తక్కువ నేలమీద నుంచి కర్రలుపాతుకుని పరజాలు కట్టి కట్టాల్సిందే గానీ, ఆ మేడమీద, కనీసం ఆ కాసేపన్నా కూర్చునే అధికారంలేదు. ఇంకా ఆ లెక్కన ఆలోచిస్తే ఆ ఇంట్లో పనిచేసే పనిమనిషి కొంత

వరకు అదృష్టవంతురాలేమో అనిపించింది వెంకడికి. కాని అదైనా గాజులు అమ్ముకునే వాడి పనిలాంటిది అనిపించి వెంకడు ఓ నిట్టూర్పు విడిచాడు.

ఆ మూడంతస్థుల మేడ తనకేమీ అపకారం చెయ్యకపోయినా, వెంకడికి ఎంచేతో దానిమీద చెప్పలేనంత కోపంగావుంది. కారణం బహుశా వుంది. (ఆ మేడ) తన అల్పత్వాన్ని రుజువు చేస్తోందనేమో! లేకపోతే అది తనది కాకపోవటమో! నిజంగా అదే తనదైతే దానిమీద తనకి అంత కోపంవుంటుందా? వెంకడు ఆలోచనలు తప్పుదారి పట్టినాయని తెలుసుకొని, గుర్రం పగ్గాల్ని సందులిప్పేటప్పుడు లాగినట్టు మనసుని ఇంకోవైపు తిప్పాడు.

వెంకడి మనస్సు ఆలోచనల గాడిలోపడింది. తనూ, తన జీవితం-! ఎందుకూ పనికిరాని తన జీవితంగురించి ఆలోచించటంలో వెంకడు రోజూ ఎన్నోగంటలు ఖర్చుపెడతాడు. అందులో ఎక్కడో తనకి తెలియని ఆనందం కొంచెంవుంది. చివరికి మంచంలోంచి లేచేటప్పుడు వెంకడు కొంచెం బరువుగాలేచినా, ఆశల్లేని తన జీవితం గురించి తలుచుకోవటంలోనన్నా కొంచెం ఆనందాన్ని పొందగలుగుతాడు. కానీ, రోజూ ఏవేవో ఆలోచించే తన మనసు ఇవ్వాళ ఈ మూడంతస్థుల మేడమీద పడింది. కనీసం ఊహల్లోకూడా అంతఎత్తు వూహించలేకపోయిన వెంకడికి, ఆనాడు మంచంమీదనుంచి లేచే ఓపిక కూడా లేకపోయింది. గుర్రబ్బండి తోలటంలో ఎంతో నేర్పువున్న తనమనసు, కేవలం గుర్రాన్ని మాత్రమే, అది అనుకున్నవైపు పోకుండా చేయగలదు గానీ, తను తలుచుకొన్నవైపు పోకుండా వుండలేదు. అందుకనే వెంకడికి ఆనాడు పదిగంటలైనా పక్కమంచంలోంచి లేవాలని తెలీలేదు. ఆలోచన్లకి తన మనసు బానిస. తన మనసుకి తను బానిస!

సూర్యుడు చాలాఎత్తులేచాడు. మూడంతస్థుల మేడమీద, పొడుగు చాలాతగ్గింది. మేడనీడ అంచులు నేలమీద స్పష్టంగా కనిపిస్తున్నయ్.

అంతుతెలియని సముద్రంలో ఈత కొడుతున్నట్టు, ఆలోచిస్తున్నాడు వెంకడు.

"వెంకన్నా—బండికట్టు!" అన్నమాటలకి త్రుళ్ళిపడి లేచాడు.

లేచీ లేవగానే వెంకడు ఎంత పొద్దైందోనని మేడనీడని చూశాడు.

అబ్బో! తను మూడో అంతస్థు నీడలో వున్నాడు!! పొద్దున ఎంతో దూరానవున్న నీడ ఇప్పుడు తనదగ్గిరికి ఒచ్చి ఏదోచెప్పినట్లై, వెంకడు మనసులో తృప్తిగా నవ్వుకొన్నాడు.

# అప్పకవి - బావకవి

అప్ప కవితనుసెప్పు, బావయు
అప్పుడప్పుడుసెప్పు కవనము;
అప్ప బావయు కలసియుండిన
గొప్పకవనము సెప్పియుందురు.

అప్పకవితను ఎల్లవారలు
గొప్పదంచును ఒప్పుకుందురు;
బావపాడిన పాటలెల్లను
పాడుపాటని దెప్పుచుందురు.

పదిమంది తనపాట పాడుపాటని తెగడ
అదిరె! గొప్పదటంచు అప్పకవితనుపొగడ
మదిలోన ఈసు నెమ్మదిగాను రగిలింది
తప్పు పట్టెడు బుద్ధి తట్టింది బావకు.

అప్పకవి సెప్పినది సుతరాం
ఒప్పుకొనడూ బావ కవితా
నెప్పుడూ ఎదో తప్పటంచును
దెప్పుచుండునుగా...

ఔనులే! ఇది ప్రకృతి సహజము!
అందులో సందేహమెందుకు?
అప్పకవికీ బావకవికీ
ఎప్పుడూ పడదు...

—శ్రీరామకవచం వెంకటేశ్వర్లు.